ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025 5 అనంతపురం





గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీరు

బిటి ప్రాజెక్ట్ నాలుగు గేట్లు ఎత్తివేత

దిగువకు నీరు విడుదల

ప్రజాశక్తి - గుమ్మగట్ట, రాయదుర్గం

భైరవానితిప్ప ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువ ఉండడంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వేదావతి హగరికి నాలుగు గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ హరీష్ కుమార్ తెలిపారు. నది పరివాహక ప్రాంతం కర్నాటక రాష్ట్రంలో వాణి విలాస్ రిజర్వాయర్ నిండి ఎక్కువైన నీరు వేదవతి నదిలో రాగా బిటి ప్రాజెక్టులోకి 3750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 1655 అడుగులు కాగా ప్రస్తుతం 1653.2 అడుగుల మేరకు నీటి మట్టం ఉంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.724 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 5,6,7,8 గేట్లను ఒక అడుగు మేరకు ఎత్తి 3500 క్యూసెక్కుల నీటిని వేదవతి నదిలోకి అధికారులు విడుదల చేశారు. పర్యవసానంగా గుమ్మగట్ట వైపు నుండి వేపలపర్తి నడుమ వేదవతి నదిపై నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. భూపసముద్రం వద్ద కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది.రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసిన తొలి రోజునే ఒక యువకుడు స్పిల్ వే వద్ద నీటిలో పడి మృతి చెందడంతో ప్రాజెక్టు వద్ద నీటిలో ఎవరు దిగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేపలపర్తి గుమ్మగట్ట నడుమ వేదవతి కాజ్ వే పై రాకపోకలు సాగించకుండా అడ్డుకట్ట వేశారు. నదిలో నీటి విడుదల అధికం కావడంతో కనేకల్లు మాల్యాం నడుమ వేదవతి నదిలో రాకపోకలు నిలిచిపోయాయి. గుండ్లపల్లి వద్ద నదిపై కొత్తగా నిర్మించిన వంతెన వద్ద అనేకమంది నీటి ప్రవాహాన్ని తిలకించారు.

16 ఏళ్లుగా పెండింగే...

66 వాయిదాలైనా అరెస్టు లేదు
ఎస్సీఎస్టీ అట్రాసిటీ బాధితులకు న్యాయం జరిగేదెన్నడు ?
నేడు 'అనంత'లో సాంఘిక సంక్షేమ కమిటీ పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఎస్సీ,ఎస్టీ కేసుల నమోదవుతున్నప్పటికీ వాటి పరిష్కారాలకు దశాబ్దాల తరబడి బాధితులు ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కేసులు పూర్తయి శిక్షలు పడేలోపు జీవితకాలం కాస్తా పూర్తవుతున్నాయి. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతోపాటు సాంఘిక సంక్షేమ పరిస్థితులను అధ్యయనం చేయడానికి శాసనసభా పక్ష కమిటీ అనంతపురం జిల్లాకు మంగళవారం రానుంది. కమిటీ అధ్యక్షులు వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో సభ్యులు కొండ్రు మురళీ, కొలకుపూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవి వరప్రసాద్, బొనెల విజయచంద్ర, ఎంఎస్.రాజు, రోషన్ కుమార్, విజయకుమార్, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ, బొమ్మి ఇస్మాయిల్, ప్రసాద్, మురళీధర్ తదితరులు రానున్నారు. ఈనేపథ్యంలోనైనా అనేక ఏళ్లుగానున్న ఎస్సీఎస్టీ అట్రిసిటీ కేసుల నమోదుపై దృష్టి సారిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

16 ఏళ్లుగా పెండింగులోనే ..

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు చాలా వరకు త్వరిగతిన పూర్తవడం లేదన్న విమర్శ ఉంది. దశబ్దాల తరబడి పెండింగులోనే ఉంటుండటంతో బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదన్న అసంతృప్తి ఉంది. కేసుల తీరు ఏ రకంగా ఉందనటానికి ఒక ఉదాహరణగా గార్లదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలో నమోదయిన ఒక కేసును చూడవచ్చు. 2009లో గార్లదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలో దళిత కొండూరు మునియప్పపై సయ్యద్ బాషా దాడి చేసినట్టు కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి 2010 అక్టోబరు నాలుగో తేదీన పోలీసులు ఛార్జీ షీటు దాఖలు చేశారు. ఎస్సీఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 2011లో ఈ కేసును మార్చారు. కేసు విచారణ 2014న ఆరంభమైంది. అప్పటి నుంచి వాయిదాలు మీద వాయిదాలు పడుతున్నాయే తప్ప నాన్‌బెయిలబుల్ కేసు కింద నిందితుడు కోర్టు హాజరైంది లేదు. ఈ కేసు నమోదయి 16 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితుడిని కోర్టు ముందుకు తీసుకురాలేకపోయారు. దీంతో బాధితుడికి న్యాయం జరిగే పరిస్థితి లేకుండాపోయింది. ఇలాంటి కేసే 2012లో నుంచి పెండింగులోనే ఉంది. రాప్తాడు పోలీసు స్టేషన్ పరిధిలో 2017 నుంచి ఒక కేసు వాయిదాలతోనే నడుస్తోంది. మచ్చుకు ఇవి మాత్రమే. ఇలాంటి కేసులు పదుల సంఖ్యలో జిల్లాలో పెండింగులో ఉన్నాయి. కేసుల్లో జరుగుతున్న జాప్యంతో నిందితులు తప్పించుకుని బయటకు తిరుగుతున్నారు. బాధితులకు మాత్రం న్యాయం జరిగే సూచనలు కనిపించడం లేదు. న్యాయం కోసం కళ్లక కాయలు కాసేలా న్యాయదేవత వైపు ఎదురు చూడాల్సి వస్తోంది.

నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి



ఎస్సీ,ఎస్టీ కేసుల విచారణలోనూ తీరని జాప్యం జరుగుతోంది. తద్వారా బాధితులకు సకాలంలో న్యాయం జరగడం లేదు. ఈ జాప్యాన్ని చూసుకుని మరికొంత మంది ఎస్సీ,ఎస్టీలపై దాడులకు తెగబడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం జాప్యం చేయకుండా కేసుల విచారణ వేగవంతం చేయడంతోపాటు త్వరితగతిన నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే నిందితుల్లో భయం ఏర్పడే అవకాశముంది.

ఓ.నల్లప్ప,
కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు

అప్రమత్తంగా ఉండాలి

మొంథా తుఫాన్ నేపథ్యంలో తక్షణ సహాయ చర్యలు
కలెక్టర్ ఓ. ఆనంద్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, వాతావరణ శాఖ హెచ్చరికలు, సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవన్ నందు జిల్లా అధికారులతో మొంథా తుఫాను సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాపై సదరు తుఫాను తీవ్ర ప్రభావం లేనప్పటికీ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నందు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్: 8500292992 కి కాల్ చేసి సహాయం పొందవచ్చని అన్నారు. అలాగే ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు సహాయం కొరకు కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని అన్నారు. అలాగే తుఫాను కారణంగా భారీ వర్షాల ప్రభావం వలన దెబ్బ తిన్న జిల్లాలకు అవసరం మేరకు ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు జిల్లాలోని పలు శాఖల అధికారులు సిబ్బంది జిల్లా పంచాయతీ శాఖ, ఏపీఎస్పీడీసీఎల్ తదితర శాఖలు సహాయక చర్యలకు హాజరయ్యేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, రామ్మోహన్, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ. 6కోట్ల వ్యయంతో జాతీయ స్వచ్ఛవాయు కార్యక్రమం కింద ఎంక్యాప్ ఫండ్స్‌తో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎం క్యాప్ థర్డ్ పార్టీ ఆడిట్ టీం సోమవారం నగరంలో పరిశీలించింది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మార్గదర్శకాల మేరకు అనంతపురంలో అమలు చేస్తున్న సిటీ యాక్షన్ ప్లాన్‌పై 3వ పక్ష ఆడిట్ నిర్వహించింది. ఇందులో భాగంగా ఆడిట్ టీం బృందం ఐఐటి తిరుపతి నిపుణులు ప్రొఫెసర్ సురేష్ జైన్ ఆధ్వర్యంలో పలు ప్రాజెక్టులు, పచ్చదనం అభివృద్ధి, జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్, కాలుష్య నియంత్రణ చర్యలు, వాహన ఎమిషన్ అవగాహన, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి పనులను పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో సమావేశమైన ఆడిట్ సిబ్బంది కాలుష్య నియంత్రణ, గ్రీనరీని పెంపొందించినందుకు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డాక్టర్ సురేష్ జైన్, నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్, ఆర్టీఓ శాఖ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికుల తొలగింపులు ఆపాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో 17 సంవత్సరాలుగా పని చేస్తున్న కళ్యాణదుర్గం డివిజన్‌లోని కార్మికుల అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కింద ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో 900 గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తు 600 మంది కార్మికులు 17 సంవత్సరాలుగా తక్కువ వేతనాలు పని చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా కార్మికులపై వేధింపులు, తొలగింపులు, వేతనాలు బకాయి పెట్టడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. టెండర్ వేసే ముందు, ఆ తరువాత కార్మికులను సంప్రదించి చర్చలు జరిపేవారని తెలిపారు. కానీ 2025 సంవత్సరం ఆగస్టు నుంచి కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ అడపాల వెంకట్రావు కనీసం కార్మికులతో చర్చలు జరపలేదన్నారు. ఆయన ఎక్కడ ఉంటాడో తెలియదన్నారు. ఈయన స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ పరిచయస్తుడని తెలిసిందన్నారు. ఈ కాంట్రాక్టర్ వచ్చిన తరువాత కార్మికులపై వేధింపులు తొలగింపులు పెరిగాయని అన్నారుజకార్మిక చట్టాలు ఉల్లంఘిస్తు ప్రతి కార్మికుడు ఖాళీ బాండ్ పేపర్ మీద సంతకాలు పెట్టాలంటూ ఆదేశిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. గతంలో ఇస్తున్న వేతనం పిఎఫ్‌తో కలిపి రూ.17,300 కాకుండా రూ.11 వేలు మాత్రమే ఇస్తానని, ఇచ్చిందే తీసుకోవాలని కార్మికులను కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. షరతులు పెట్టి తన మనిషి సూపర్‌వైజర్ కిరణ్ ద్వారా రోజూ కార్మికులను బలవంతంగా దౌర్జన్యంగా ఖాళీ బాండ్లపై సంతకాలు చేయిస్తున్నాడని తెలిపారు. సంతకాలు చేయకపోతే పని చేయడానికి వీలు లేదంటూ కార్మికులను బెదిరిస్తున్నాడని అన్నారు. కార్మికుల పట్ల ఇలాంటి చర్యలు సరికావన్నారు. 17 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికుల్లో 23 మందిని విధుల్లోకి రావద్దంటూ బెదిరిస్తున్నాడన్నారు. గ్రామాల్లో కార్మికులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి కార్మికులపై దాడి చేయించేందుకు కిరణ్ ప్రయత్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పరిశీలించి కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపాలన్నారు. కార్మికులందరిని యధావిధిగా విధుల్లోకి కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ బాండ్లపై సంతకాలు సేకరించే విధానానికి స్వస్థి పలకాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.ఎర్రిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాము, కోశాధికారి హెచ్.వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధులు వీఎన్. రెడ్డి ఇకలేరు

పజాశక్తి-హిందూపురం

హిందూపురం సమీపంలోని కర్నాటక రాష్ట్రం వెంకటాపురంలో నివాసముంటున్న ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు బిఎన్.రెడ్డి (103) సోమవారం మతి చెందారు. స్వాతంత్ర సమరయోధులు కల్లూరు సుబ్బారావు, ఎఎం. లింగన్న సమకాలికులు వియన్ రెడ్డి. స్వాతంత్ర ఉద్యమాలలో అనేకసార్లు జైలు జీవితం గడిపారు. కర్నాటక ప్రాంతంలోని విధురాస్వతంలో జరిగిన దక్షిణ భారత జలియన్వాలాబాగ్ ఉద్యమంలో కూడా కల్లూరు సుబ్బారావుతో కలసి పాల్గొన్నారు. ఆ ఉద్యమంలో అనేకమంది కాల్పుల్లో మృతిచెందారు. బిఎన్. రెడ్డి ఎంతో సామాజిక స్పృహతో గత శతాబ్దపు జీవన విధానాన్ని ఇప్పటి తరానికి వారధిగా ఉండి అందించిన గొప్ప మానవతా వాది. ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆఇటు ఆంధ్రా, అటు కర్నాటక ప్రాంతాలకు చెందిన అనేకమంది ప్రముఖులు, రాజకీయ, కార్మిక, సంఘాల నాయకులు వెంకటాపురం చేరుకుని ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

మున్సిపల్ ఆర్‌డి కార్యాలయం ముందు ధర్నాలో సిఐటియు నాయకులు



కార్మికుల సమస్యలు వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం తగదని సిఐటియు నాయకులు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. మున్సిపల్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి తిరుమలేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగభూషణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ హాజరై మాట్లాడారు. అనంతపురం నగరపాలక సంస్థలో పనిచేస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నగరంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. సకాలంలో పనిముట్లు, ఇవ్వాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు 2011 సంవత్సరానికి చెందిన 9 నెలల ఈపీఎఫ్ బకాయి వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలో అవినీతికి పాల్పడుతూ ఇంజనీరింగ్ కార్మికులను ఇబ్బందులు కలిగిస్తూ వేధిస్తున్న ట్యాప్ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు అనేక స్థానిక సమస్యలతో ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం శానిటరీ ఇన్స్పెక్టర్ అలీ ఖాన్ కార్మికులకు 18 నెలలుగా పనిముట్లు ఇవ్వడం లేదని దీంతోకార్మికులే వారి వేతనం నుండి స్వయంగా పనిముట్లు కొని కళ్యాణదుర్గం పట్టణం ను శుభ్రం చేయాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. పనిముట్లు అడిగితే కార్మికులపై దుర్భాషలాడుతూ కార్మిక నాయకుల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయదుర్గం మున్సిపల్ పట్టణంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. గుంతకల్ మున్సిపల్ పరిధిలోకి కార్మికులకు యూనిఫామ్ కొబ్బరినూనె చెప్పులు అందజేయడంలో కమిషనర్ ఒంటెద్దు పోకడ అనుసరిస్తున్నారని విమర్శించారు. గుత్తి పురపాలక సంఘంలో కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీ నాగరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు రామాంజనేయులు, జుబేర్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, పుల్లన్న, ఎర్రి స్వామి, ఓబులపతి, పెన్నోబులేసు, వన్నూరు స్వామి, రాము, మల్లేష్, నాగరాజు, సూర్యనారాయణ, బ్రహ్మానంద రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీ ఛైర్మన్ రెడ్డప్ప రెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి - తనకల్లు



రెడ్డప్పరెడ్డి (ఫైల్‌ఫొటో)

మండల పరిధిలోని పరాకువాండ్లపల్లికి చెందిన మాజీ జెడ్పీ ఛైర్మన్ దేశాయి రెడ్డప్ప రెడ్డి వయోభారంతో సోమవారం మృతిచెందాడు. రెడ్డప్పరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీలో కొనసాగుతూ 1981 వ సంవత్సరంలో తనకల్లు గ్రామ సర్పంచిగా (అప్పట్లో సమితి ప్రెసిడెంట్ అనేవారు)గెలుపొందారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన 1981 సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్మన్ గా ఎంపికయ్యారు. 1985 వ సంవత్సరంలో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 1991 నుండి 1993 వ సంవత్సరం వరకు డిసిసిబి ప్రెసిడెండ్‌గా పని చేశారు. మండల వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు పరాకు వాండ్లపల్లి లో మార్కెట్ యార్డ్, పశువుల ఆసుపత్రి, తనకల్లు మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి ఆయన కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. అలాగే ప్రతి గ్రామంలోనూ ఆయన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు మండల ప్రజలు చెబుతున్నారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన పరాకు వాండ్ల పల్లిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసు ఆయుధాల వాడకంపై అవగాహన అవసరం

ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో ఎస్పీ జగదీష్



వాకీ టాకీ పనితీరును విద్యార్థులకు చెబుతున్న దృశ్యం

ప్రజాశక్తి - అనంతపురం

పోలీసులు తమ విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థులు విద్యార్థి దశ నుండే అవగాహన కల్గి ఉండటం మంచిదని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని షాదీఖానాలో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. సుశిక్షుతులైన సిబ్బందిచే సందర్శనకు విచ్చేసిన ప్రజలకు ఆయుధాల గురించి అవగాహన చేశారు. ఏ సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పని తీరు గురించి ఈసందర్భంగా విద్యార్థులకు జిల్లా ఎస్పీ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుండి 31 వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటామన్నారు. వారోత్సవాల్లో భాగంగా భావిభావి భారత పౌరులైన విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో పోలీసు వినియోగించే ఆయుధాలు, ఇతర సామగ్రి గురించి వారికి వివరించి ఆసక్తి పెంపొందింప జేస్తున్నామని వివరించారు. ఈకార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐలు పవన్ కుమార్, మధు, రాముడు, ఆర్ ఎస్ఐలు బాబ్జాన్ , మగ్బుల్, రమేష్ నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, పోలీసు సిబ్బంది. నగరంలోని పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు

'దుర్గం' ఆక్రమణల తొలగింపులో రాజకీయ రగడ

కమిషనర్‌ను ప్రశ్నించిన టిడిపి నేత మారుతీచౌదరి
తొలగింపులు ఆగవన్న కమిషనర్
ఆక్రమణల వివాదాన్ని ముందే చెప్పిన 'ప్రజాశక్తి'



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న టిడిపి నాయకుడు మారుతీచౌదరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో రాజకీయ వేడి ప్రారంభమైంది. వైసీపీ సానుభూతి పరురాలు దివ్య హోటల్ తొలగింపులో జరిగిన వివాదం మరువకముందే టీడీపీ అధికార ప్రతినిధి మారుతిచౌదరి పట్టణంలోని ఆక్రమణల తొలగింపులో లోసుగులపై తీవ్రంగా స్పందించారు. ఏకంగా సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌తో వాదనకు దిగారు. అవినీతిని ప్రశ్నిస్తే తనను అక్రమణదారుడిగా చిత్రీకరిస్తారా అంటూ నిలదీశారు. అంతేకాకుండా కురుబ సామాజికవర్గానికి తనను దూరంచేయడానికి కుట్రలు పన్నుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు మీడియా సమావేశాన్ని నిర్వహించిన కమిషనర్ మాట్లాడుతూ కంబదూరు రోడ్డు క్రమణలు తొలగించి తీరుతామని ప్రకటించారు. ఇదిలా ఉండగా వైసీపీ దళిత మహిళ దివ్యకు జరిగిన అన్యాయంపై ఆపార్టీ నాయకులు నామమాత్రంగా స్పందించారు.

ముందే చెప్పిన 'ప్రజాశక్తి' : కంబదూరురోడ్డు ఆక్రమణల తొలగింపు, రాజకీయ నేపథ్యం గురించి ప్రజాశక్తి దినపత్రికలో 'దుర్గంలో వ్యూహాత్మకంగా అక్రమణల తొలగింపు' అనే శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. ఆక్రమణల తొలగింపు పక్రియలో ప్రజాప్రతినిధి, టిడిపి నాయకుడి మధ్య అంతర్గత యుద్ధం మొదలైంది. వీరి మధ్య జరుగుతున్న పోరు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వ వైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద నాయకులు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఉన్న వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు గురై చిన్నపాటి గాయాలైన వారిని వైద్యులు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. అలాగే గర్భవతులకు వైద్యులు ప్రసవాలు చేయకుండా అనంతపురం, కర్నూలు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం అందకపోవటంతో చాలామంది రోగులు ఆర్ఎంపీ డాక్టర్లను సంప్రదిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు యు.మల్లికార్జున, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్‌కుమార్, ఐద్వా నాయకురాలు రేవతి, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై లోతుగా విచారించి చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ పి.జగదీష్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఎస్పీ వినతులను స్వీకరించి పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీచేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శింగనమల మండలం నిదనవాడకు చెందిన కమ్మెట కవిత, చంద్రశేఖర్ కోరారు. ఈమేరకు సోమవారం అనంతపురంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఎస్పీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఈనెల 13వతేదీన ఇల్లు శుభ్రం చేసుకుంటుండగా వక్కన ఉన్న చెండ్రాయుడు, కె.సురేష్, చంద్రకుమార్, నవిత కలిసి తమపై దాడి చేశారని వాపోయారు. అంతేగాకుండా నానా దుర్భాషలాడుతూ తన భార్యను నోటికి వచ్చినట్లు మాట్లాడారన్నారు. వీరి నుంచి తమకు ప్రాణహాని ఉందన్నారు. కావున తమపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని ఎస్పీకి విన్నవించారు.

రైతు సమస్యలపై పోరాడుదాం

ప్రజాశక్తి-బెలుగుప్ప

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదామని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఎపి రైతుసంఘం మండల మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ముఖ్యంగా మండలంలోని యర్రగుడి, తగుపర్తి, ఆంకంపల్లి, గంగవరం, కోనంపల్లి, ఆవులెన్న గ్రామాల్లో రైతుల భూములను సోలార్ పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ఆదేశాలు ఇవ్వడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా బాబు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులుగా మారెన్న, వన్నూరుస్వామి, గణేష్, క్రిష్టప్పను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బికె బీమన్న, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

తైక్వాండోలో 'భాష్యం' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025లో భాష్యం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. గతనెలలో అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తైక్వాండో ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లావ్యాప్తంగా విద్యార్థులు పోటీ పడగా పథకాలు మాత్రం భాష్యం విద్యార్థుల సొంతమయ్యాయి. పోటీల్లో భాష్యం విద్యార్థులు 4 రజత, మూడు సిల్వర్ పథకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్, రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, హెచ్ఎం షకీలాబేగం, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన తైక్వాండో క్రీడాకారులు

మొక్కలు పెంచితే అధిక వర్షాలు

అటవీశాఖ అధికారి సి.మధుబాబు

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచితే వర్షాలు బాగా కురిసి సుభిక్షంగా ఉంటారని అటవీ రేంజ్ అధికారి సి.మధు బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం అటవీ అధికారులు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అటవీ అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుంకన్న, అటవీ సెక్షన్ అధికారి వి.నారపరెడ్డి, అటవీ బీట్ అధికారి పి.రమేష్‌బాబు, ఎబిఒలు చంద్రశేఖర్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అధికారులు

తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రాయదుర్గం : తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను సందర్భంగా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ప్రజలు కమాండ్ కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 85550 79096కు ఫోన్ చేయాలని కోరారు.

అమెరికా సుంకాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-నార్పల

అమెరికా సుంకాలను భారత ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తూ రూపొందించిన సోమవారం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంపై అమెరికా సుంకాల పేరుతో దాడి చేస్తున్నా ప్రధాని మోదీ మౌనం వహించడం బాధాకమరమన్నారు. అమెరికా సుంకాలను వ్యతిరేకించడంతోపాటు దేశ వ్యవసాయ రంగం, ఇతరత్రా పారిశ్రామిక పరిశ్రమలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిమిదొడ్డి ప్రభాకర్, కేశేపల్లి ఎర్నాగప్ప, నాగన్న, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఎన్నికల హామీల అమలుకు కృషి

ఎంపి అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలో రూ.77లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, మోటార్ పంపులను ఎంపి, ఎమ్మెల్యే ప్రారంభించారు. బుడ్డప్పనగర్, శ్రీనగర్ కాలనీల్లో ఉన్న వాటర్ ట్యాంకుల వద్ద స్టార్ డెల్టా స్టార్టర్ బాక్స్, 20 హెపి బూస్టర్, మోనోబ్లాక్ మోటార్ పంపులను ఏర్పాటు చేశారు. అత్యాధునిక మోటార్లను రూ.5లక్షలతో ఏర్పాటు చేశారు. ఆజాద్‌నగర్, 1వ రోడ్డులోని పొట్టి శ్రీరాములు స్కూల్ వద్ద సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.30కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. 20ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, డ్రెయిన్లు కూడా వేస్తున్నట్లు వివరించారు. గతంలో కొన్ని కాలనీల్లో రోజు మార్చి రోజు నీరు వస్తుండేదని, ఇప్పుడు రోజూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు సమావేశాలకు సరైన సదుపాయం లేదని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకురావడంతో స్పందించి కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



మోటార్లను ప్రారంభిస్తున్న ఎంపి అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుస కరువులతో అల్లాడుతున్న జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మండలంలో అరకొర సాగు చేసిన వేరుశనగ, పత్తి పంటలు ఇటీవల కురిసిన వర్షాలకు కుళ్లిపోయిందన్నారు. అలాగే కంది పంట దెబ్బతిందన్నారు. కావున వేరుశనగ, కంది, పత్తి రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని, హెచ్చెల్సి 5వ కాలువ డిస్ట్రిబ్యూటరీ సలకంచెరువు చెరువకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని, నిరుపేదల కుటుంబాలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని, నిదనవాడలో ఎస్సీలకు శ్మశాన స్థలం కేటాయించాలన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండల ప్రజాశక్తి విలేకరి పెద్దన్నపై దాడి చేసిన ఎర్రమట్టి, ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, మునయ్య, నాగయ్య, రాజు, ఎర్రిస్వామి, కొండారెడ్డి, సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

వైసిపి జిల్లా అధ్యక్షులు 'అనంత'

ప్రజాశక్తి-అనంతపురం

పేద వైద్య విద్యార్థుల కోసం ఏడాదికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు లేరా..? అంటూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కూటమి ప్రభుత్వంపై ఏడాదిన్నరలోనే ప్రజా వ్యతిరేకత తీవ్రంగా వచ్చిందన్నారు .చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ప్రజాప్రతినిధులు ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఎక్కడ చూసినా భూఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం అవలంభిస్తోంది. వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో మెరుగైన వైద్యంతో పాటు వైద్య విద్యను పేదలకు చేరువ చేయాలని ముందుకెళ్లాం. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 10 మెడికల్ కళాశాలలను తన వాళ్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రజా ఉద్యమంలో అన్ని వర్గాలు భాగస్వాములు అవుతున్నారన్నారు. ప్రభుత్వ మెడలు వంచేందుకు వామపక్షాలు, ప్రజాసంఘాలు, మేధావులు కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

పుట్లూరు : మండలంలోని ఓబుళాపురం, దోసలేడు, చెర్లోపల్లి గ్రామల్లో సోమవారం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ మాట్లాడుతూ పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వాన్ని పూనుకుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇది జరగనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని దుర్గం గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు, సాకే సతీష్, పవన్‌కుమార్, కురవ శ్రీరాములు, కోడి మూర్తి, నారాయణస్వామి, మాజీ డీలర్ రామాంజనేయులు, వడ్డీ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



మద్యం బాటిళ్లను స్కాన్ చేస్తున్న అధికారులు

నకిలీ మద్యంపై నిరంతర నిఘా

ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

నకిలీ మద్యం నియంత్రణకు నిరంతరం నిఘా ఉంచామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ (అసిస్టెంట్), ఎన్‌ఫోర్స్‌మెంట్ శ్రీరామ్‌తో కలిసి సోమవారం కళ్యాణదుర్గం ఎక్సైజ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా వివిధ కేసులపై ఆరాతీశారు. అనంతరం పట్టణంలోని మద్యం దుకాణాల వద్దకెళ్లి ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌తో మద్యం బాటిళ్లను స్కానింగ్ చేశారు. నకిలీ మద్యం ఏమైనా విక్రయిస్తున్నారా.. అని అడిగి తెలసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ సోమశేఖర్, ఎస్ఐ శంకర్‌నారాయణ, సిబ్బంది, ఇమ్రాన్, నరసరాజు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : మండలం పరిధిలో పంపనూరు తండాలో నూతనంగా వెలిసిన కాళీకామాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వివాహానికి ప్రతి ఒక్కరూ రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట వైసిపి నాయకులు, గ్రామస్థులు, అభిమానులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నాయకులు

'వేదవతి' వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బెలుగుప్ప : గుమ్మఘట్ట మండల పరిధిలోని భైరవానితిప్ప ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడంతో మండలంలోని వేదవతి నది వద్ద అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ కర్ణాటక ప్రాంతంలో అధిక వర్షాలు కురవడంతో భైరవానితిప్ప ప్రాజెక్టు గేట్లు ఎత్తారన్నారు. దీంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. కావున మండల పరిధిలోని నది పరీవాహక ప్రాంత గ్రామాలైన నరసాపురం, రమినేపల్లి, బ్రాహ్మణపల్లి, గుండ్లపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.


ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

తహశీల్దార్‌కు జర్నలిస్టుల వినతి

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండల ప్రజాశక్తి దినపత్రిక విలేకరి పెద్దన్నపై దాడి చేసిన మట్టి, ఇసుక మాఫియాపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాపై దాడులకు పాల్పడటం దారుణమన్నారు. దాడులు, దూషణలతో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించాలని చూడటం మంచిది కాదన్నారు. భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. దాడులతో అవినీతి, అక్రమాలు బయటకు రాకుండా చూడాలనుకోవడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. వెంటనే విలేకరిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎం.బాలరంగారెడ్డి (వార్త), ఆర్.మునెప్ప (సాక్షి), ఎన్.నగేష్ (ఆంధ్రజ్యోతి), ఎం.నాగేశ్వరరావు (ఆంధ్రప్రభ), వరకూటి శంకర్ (విశాలాంధ్ర), పేట ఆదినారాయణ (ప్రజాశక్తి), సి.సూర్యచంద్రారెడ్డి (అనంత ఫోకస్), ఓబులేసు (మనం), నాగశేషు (పయనించే సూర్యుడు), హరి (ప్రజా టివి), తదితరులు పాల్గొన్నారు.

నార్పల : బుక్కరాయసముద్రం ప్రజాశక్తి దినపత్రిక విలేకరి పెద్దన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసే స్వేచ్ఛ పత్రికలు, జర్నలిస్టులకు ఉంటుందన్నారు. అలాంటి వారిపై బెదిరింపులు, భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. తక్షణమే పత్రికా విలేఖరి పెద్దన్నపై దాడికి దిగిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

మొక్కజొన్న కొనుగోలుకు సహకరించండి

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విప్ కాలవ వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గంలో రైతులు పండించిన మొక్కజొన్న ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ, విప్ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం ఈ మెయిల్ ద్వారా మంత్రికి విన్నవించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ కష్టార్జిత ధనంతో, ఆరుగాలం శ్రమించి మొక్కజొన్న పంటను సాగు చేశారని వివరించారు. అత్యంత వెనుకబడ్డ రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల రైతులు దాదాపు 12115 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగు చేశారని తెలిపారు. పంట దిగుబడి సంతృప్తికరంగా వచ్చినప్పటికీ, గిట్టుబాటు ధర అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400గా ఉండగా దళారులు కేవలం రూ.1,700కే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. దీంతోపాటు తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా రైతులు పంటను అరబెట్టడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఎకరాకు సాగుకు సుమారు రూ.30వేల పైగా పెట్టుబడి పెట్టారని వివరించారు. రైతుల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొళాయిలు, ట్యాంకర్ల ద్వారా అయినా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ప్రస్తుత వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు సోకకుండా పారిశుద్ధ నిర్వహణ పటిష్టంగా చేపట్టాలన్నారు. మరమ్మతులకు గురైన వీధిలైట్లను బాగు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియాకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, నాయకురాలు రేవతి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

యాడికి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, ఎపిఒ మద్దిలేటి పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సోమవారం మండల కేంద్రం నుంచి పెద్దపేట వరకూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, వెంగల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో 'శ్రీచైతన్య' ప్రభంజనం

అనంతపురం : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన మ్యాథమాటిక్స్ ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైర్‌లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం-5 ఐపిఎల్ బ్రాంచి నుంచి 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరందరూ ఆర్ఎంఒ పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్, జోనల్ కో ఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, ఐపిఎల్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ పట్నాయక్, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి ధనుంజయనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎజిఎం

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

బొమ్మనహాల్ : మండల కేంద్రంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దివ్య జ్యోతిరాయ్, భర్త సుప్ర ప్రధాన్ గత రెండో మాసాల నుంచి బొమ్మనహాల్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వీరు మండలంలోని హరేసముద్రం వద్ద ఉన్న జిందాల్ పరిశ్రమలో పని చేస్తూ జీవనం సాగించేవారు. ఈనేపథ్యంలో ఆదివారం భార్యాభర్తలు గొడవ పడినట్లు తెలిసింది. దీంతో సోమవారం తెల్లవారుజామున చున్నీతో మెట్లపై ఉన్న కడ్డీలకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం గమనించిన సుప్ర ప్రధాన్ లబోదిబోమన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు జమేదారు తెలిపారు.

అదృశ్యమైన చిన్నారి మృతి

అనంతపురం : అనంతపురం నగరంలో శనివారం రాత్రి అదృశ్యమైన ఐదు సంవత్సరాల చిన్నారి మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగానున్నాయి. అరుణోదయ కాలనీకి చెందిన హరి,నాగమణి దంపతులకు సుశాంత్ అనే ఐదేళ్ల బాలుడు ఉన్నాడు. బాలుడు శనివారం రాత్రి నుంచి కనిపించకుండాపోయాడు. దీనిపై బంధువులు మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా సోమవారం సాయంత్రం ప్లాస్టిక్ సంచిలో కుక్కిపడేసిన ఐదేళ్ల బాలుడి మృతదేహాన్ని అనంతపురం నగర శివార్లలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తించారు. స్థానికులు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు మూడవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా, శనివారం రాత్రి తప్పిపోయిన ఐదేళ్ల సుశాంత్‌గా గుర్తించారు. వెంటనే బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుడు హత్యగావించబడటానికి కారణాలపై ఆరా తీస్తున్నారు.

గుత్తి బస్టాండ్‌లో చోరీ

గుత్తి : గుత్తి బస్టాండులో సోమవారం చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గుత్తిలోని బీసీ కాలనీకి చెందిన శ్యామ్ భార్య అనిత అనంతపురానికి వెళ్లడానికి బస్టాండ్‌కు చేరుకుంది. అనంతపురానికి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సును ఆమె ఎక్కింది. అయితే గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగును కత్తిరించి అందులో ఉన్న రూ.5వేలు నగదు, రూ.4లక్షల చెక్కులు, ఖజానా జ్యువెలరీకి సంబంధించిన విలువైన బాండ్లు అపహరించుకెళ్లారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బస్ కండక్టర్ టికెట్ తీసుకోవాలని చెప్పటంతో. ఆమె తన బ్యాగులో డబ్బు తీయడానికి చూసింది. అందులో నగదు, చెక్కులు, బాండ్లు లేకపోవడంతో రోధిస్తూ తిరిగి గుత్తి బస్టాండ్‌కు చేరుకుంది. అనంతపురంలోని ఖజానా జ్యువెలరీ షో రూమ్ లో తనకు సంబంధించిన బాండ్లు రెన్యువల్ చేసుకోవడానికి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. చోరీ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై దాడి

గుత్తి : మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో భాస్కర్ అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి కొందరు దాడి చేసి గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. గ్రామానికి చెందిన భాస్కర్‌కు అదే గ్రామానికి చెందిన కిష్టయ్య, పోలయ్య, సుబ్బయ్య, వాసు, ఆంజనేయ, కంటెన్నతో పాటుగా మరోవ్యక్తికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోమారు గొడవ జరిగి భాస్కర్‌పై కొడవలి, కర్రలతో దాడి చేసి గాయపరిచారు. భాస్కర్ ను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

గుమ్మగట్ట : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని రంగసముద్రం గ్రామానికి చెందిన పాలయ్య (30) కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థికసాయం అందించారు. పాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు నాగరాజు, శివకుమార్, బేలోడు సంజీవ, పైదొడ్డి రాజు, రామచంద్రారెడ్డి, డీలర్ రవి, ఓబన్న పాల్గొన్నారు.

కల్తీలపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం : జిల్లాలో కొనసాగుతున్న కల్తీ ఆహార పదార్థాలు, వస్తువులపై కఠిన చర్యలు తీసుకోవాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కల్తీ ఆహార వస్తువులను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలకు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కిష్ణ, ఆర్‌పిఎస్ జిల్లా నాయకులు హేమంత్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కొండాపురం సర్పంచు వనితా మల్లికార్జున కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

మామిడి చెట్ల బిల్లులు చెల్లించాలని వినతి

బ్రహ్మసముద్రం : ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన మామిడి చెట్లకు బిల్లులు చెల్లించాలని మండల పరిధిలోని నంజాపురం గ్రామానికి చెందిన గొల్ల గొల్లకెంచప్ప కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ముందు ఇతర బాధిత రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకున్న పొలంలో 2017-18లో 210 మామిడిచెట్లను గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నాటినట్లు తెలిపారు. అయితే ఇంత వరకూ బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు బిల్లులు చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గొంచిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్న పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు హరికృష్ణను సస్పెండ్ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఇఒ ఓబుళపతి తెలిపారు. హరికృష్ణ తాను పని చేసే పాఠశాలతోపాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలు, పలు ప్రయివేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో ట్యూషన్, కోచింగ్ సెంటర్ పేరుతో అనధికారకంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌ను నడుపుతున్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్‌పోటీలు

బ్రహ్మసముద్రం : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఎంఆర్‌సిలో విద్యార్థులకు ఎస్ఎ రైటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఓబుళపతి, కృష్ణానాయక్ తెలిపారు. ఇందులో విజేతులైన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి పంపనున్నట్లు తెలిపారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ సేవ పథకంలో భాగంగా ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆలమూరులో సర్పంచు జి.సౌమ్య ఆధ్వర్యంలో 6వరోజు సోమవారం ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మత్తు పదార్థాలపై కలిగే నష్టాలను వివరించారు. అనంతరం పాఠశాలలో పిల్లలపై సామాజిక ప్రవర్తన, పిల్లలు శారీరక వేధింపులకు గురైనప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.రవిప్రసాద్, ఎన్ఎస్ఎస్ పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు కృతిక, నవిత, గౌతమి, హారిక, నవ్య, షర్మిల, మల్లీశ్వరి, కుష్మిద, ప్రవీణ్, ప్రకాష్, నరేష్, రోహిత్, విష్ణువర్ధన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సోషల్ మీడియాపై అవగాహన అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కెఎస్ఆర్ పాఠశాలలో వివిధ అంశాలపై శక్తి టీమ్ సభ్యులు విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అలాగే మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, సామాజిక మాధ్యమాల వల్ల ఇబ్బందులు, మోసాలు, సైబర్ నేరాలు, డయల్ 100, 112, 1098, 181 నెంబర్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సేవాశిబిరం

రాయదుర్గం : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సోమవారం గుమ్మగట్ట మండలం 75-వీరాపురం గ్రామంలో ప్రత్యేక సేవాశిబిరం ఏర్పాటు చేశారు. ఏడు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌సన్ తెలిపారు. అనంతరం ఉన్నత పాఠశాల ప్రహరీ చుట్టూ, పాఠశాల లోపల ఉన్న గడ్డిని, పిచ్చి మొక్కలు, వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నాగరాజు, న్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి నారాయణ, కళాశాల అధ్యాపకులు బాల నరసింహులు, బాబు లక్ష్మీనారాయణ, నాగరాజురెడ్డి, వినోద్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథ్, మోహన్ బాబు, చింతయ్య, ప్రసాద్, ప్రశాంత్, భక్తవత్సలం, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

దేశాయి రెడ్డప్పరెడ్డి మృతికి నివాళి



రెడ్డెప్పరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ జెడ్పీ ఛైర్మన్ దేశాయి రెడ్డప్పరెడ్డి మృతికి పలువురు నాయకులు నివాళులర్పించారు. రెడ్డెప్పరెడ్డి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం పరాకువాండ్లపల్లెలో సోమవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న అనంత వెంకటరామిరెడ్డి పరాకువాండ్లపల్లెకు చేరుకుని పార్థివదేహానికి నివాళుర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీమంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కడపల మోహన్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, కదిరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేదవతి నీటి ప్రవాహం పరిశీలన

ప్రజాశక్తి-కణేకల్లు

భౌరవానితిప్ప ప్రాజెక్టు నుంచి వేదవతి హగిరికి నీరు విడుదల చేసిన నేపథ్యంలో టిడిపి నాయకులు సోమవారం నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కణేకల్-ఉరవకొండ మార్గమధ్యలో ప్రజలు ఎవరూ వెళ్లవద్దన్నారు. ముఖ్యంగా పిల్లలు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆనంద్‌రాజ్, చెరువు సంఘం అధ్యక్షులు బిటి రమేష్, ఆసుపత్రి కమిటీ సభ్యులు కురువ నాగరాజు, సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వెదవతి హగిరి గట్టును పరిశీలిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలు పట్టించుకోండి

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు మున్సిపల్ పాలకమండలి సభ్యులు కోరారు. పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప అధ్యక్షతన సోమవారం పట్టణంలోని కౌన్సిల్ హాల్‌లో రాయదుర్గం పురపాలక సంఘం సాధారణ, అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ పట్టణ ప్రధాన రహదారి మధ్య విభాగిని వద్ద మొక్కలు పెంచకపోవడం వల్ల బోసిపోయి ఉందన్నారు. అక్కడ తాజా మట్టిని వేసి కొత్తగా మొక్కలు ఏర్పాటు చేస్తే ఆహ్లాదకరంగా అందంగా కనిపిస్తోందన్నారు. పలు రహదారి మలుపుల వద్ద అడ్డుగా ఉన్న డివైడర్లను తొలగించాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఇ సురేష్, టిపిఎస్ మురళీమోహన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రయాదవ్, అకౌంటెంట్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



కౌనిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

స్క్రీనింగ్‌తో క్యాన్సర్ నివారణ

నోడల్ అధికారి నారాయణస్వామి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత ప్రజలను పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి నివారణ కేవలం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని డాక్టర్ నారాయణస్వామి సూచించారు. సోమవారం స్థానిక ఇందిరాగాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ రోహిత్‌నాయుడు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్లు వివిధ మార్గాల ద్వారా వ్యాపిస్తాయన్నారు. ప్రధానంగా రొమ్ము కాన్సర్, గర్భాశయ ముఖద్వారం, నోటి క్యాన్సర్లు అత్యధికంగా వ్యాపిస్తాయన్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతాయన్నారు. ప్రభుత్వం కూడా ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బి.శ్రీరాములు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

'సాయి'కి భారత్ కమల్ పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

న్యూఢిల్లీకి చెందిన భారత్ సేవా సొసైటీ వారు ప్రతిష్టాత్మకంగా ఏటా ఇచ్చే భారత్ కమల్ పురస్కార్-2025 అవార్డు అనంతపురానికి చెందిన సాయిట్రస్టు అధ్యక్షులు డాక్టర్ విజయ సాయికుమార్‌ని వరించింది. ఈమేరకు న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా విజయ సాయికుమార్ హాజరు కాలేకపోవడంతో పోస్ట్ ద్వారా అవార్డును పంపారు. ఈ అవార్డును జిల్లాకు చెందిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్టు బృందం రాఘవేంద్ర, విజయభాస్కర్, సత్యసాయి కళ్యాణ మండపం ఇన్‌ఛార్జి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించారు ఇందులో ప్రతిభ చూపిన క్రీడకారులు అనంతపురం డివిజన్ స్థాయి పోటీలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, మండల విద్యాధికారి కృష్ణయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, మండల కో ఆర్డినేటర్ ఆంజనేయులు, పీడీలు శ్రీనివాసులు, సుజాత, కాటమయ్య, రామన్న, శ్రీదేవి, నసీమాబేగం, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' పేరు జాతీయ స్థాయిలో వినిపించాలి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి అనంతపురం

అనంతపురం పేరును జాతీయస్థాయిలో వినిపించాలని తైక్వాండో విజేతలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 42వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి జూనియర్ తైక్వాండో పోటీల్లో అనంతపురం వాసులు గెలుపొందారు. ఈ నేపథ్యంలో అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటిని కలవగా ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అనంతపురం పేరు వినిపించేలా చేశారన్నారు. ఇప్పుడు బెంగళూరులో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో కూడా పతకాలు సాధించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ కు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని సూచించారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి